ఎర్రగట్టు గుట్ట జాతరకు వేళాయె

- నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు
- రాత్రి 11.48 గంటలకు కల్యాణం
- ఐదురోజుల పాటు వేడుకలు
- జాతర చరిత్రలో తొలిసారి చైర్మన్ లేకుండా ఈసారి ఉత్సవాలు


హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఐదురోజుల పాటు కొనసాగనున్నాయి. హసన్‌పర్తి – భీమారం గ్రామాలు సంయుక్తంగా ఈ వేడుకలను నిర్వహించనున్నాయి. హోలి వేడుకలు ముగిశాక ఇరు గ్రామాల నుంచి అలివేలు మంగ – వేంకటేశ్వరస్వామి ప్రతిమలను రథాలపై ప్రతిష్ఠించి భారీ ప్రదర్శనలతో ఎర్రగట్టు గుట్టపైకి తీసుకొస్తారు. దీంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

ఈసారి చైర్మన్ లేకుండానే..

ఎర్రగట్టు వేంకటేశ్వస్వామి ఉత్సవాలు ఈసారి చైర్మన్ లేకుండానే నిర్వహిస్తున్నారు. 14 మందితో ధర్మకర్తలతో కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో ధర్మకర్తలు కలిసి ఒకరిని తాత్కాలిక చైర్మన్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. గతంలో కూడా ఉత్సవ కమిటీని నియమించినప్పుడు చైర్మన్‌ను ధర్మకర్తలు ఎన్నుకున్నారు. ప్రస్తుతం ధర్మకర్తల్లో నాలుగు వర్గాల వారు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే నాగరాజు కూడా పట్టించుకోకపోవడంతో చైర్మన్ నియామకం జరగలేదని స్థానికంగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చైర్మన్ నియామకం లేకపోవడంతో ఉత్సవ ప్రమాణ స్వీకారానికి కమిటీ సభ్యులు ముందుకు రాలేదు. జాతర చరిత్రలో చైర్మన్ లేకుండా ఉత్సవాలు నిర్వహించడం ఇదే తొలిసారి.

ఏర్పాట్లు పూర్తి

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈట కిషన్‌రావు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం కోసం సౌకర్యాలు కల్పించినట్లు వారు చెప్పారు.



ఎర్రగట్టు గుట్టపై వెలిసిన వేంకటేశ్వర స్వామి దేవాలయం

స్వామి వారికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అతిథులు

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామికి ఆదివారం పట్టువస్త్రాలు సమర్పించారు. మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న చింతగట్టుకు చెందిన పరికిపండ్ల నరహరి.. ప్రతిఏటా హోలీ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది నరహరి తన సోదరులు రాము, లక్ష్మణ్, శ్రీనివాస్, వేణు, దామోదర్, అశోక్ ద్వారా పట్టు వస్త్రాలు పంపించారు. ఈ సందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు పార్థసారధి, దేవస్థాన ధర్మకర్తలు పెద్దమ్మ సురేష్, శైలజ, అటికం శ్రీనాథ్, నరహరి కుటుంబ సభ్యులు మలీశ్వరి, కల్పన, సింధు, సుమలత, దీపిక, సత్యరాజ్ పాల్గొన్నారు.

కార్యక్రమాల వివరాలు

- ఈనెల 25న (సోమవారం) సాయంత్రం 5గంటలకు హసన్‌పర్తి – భీమారం గ్రామాల నుంచి ఎర్రగట్టు గుట్ట మీదికి స్వామివారి రాక, రాత్రి పెద్దచక్రాల ప్రదర్శన
- రాత్రి 11.48గంటలకు స్వామివారి కల్యాణం
- 26న (మంగళవారం) రాత్రి 7గంటలకు చిన్న చక్రాల ప్రదర్శన
- 27న (బుధవారం) విశేష పూజ, కుంకుమార్చనలు, హారతి ప్రసాద వినియోగాలు
- 28న (గురువారం) క్షీరాభిషేకం, అర్చనలు
- 29న (శుక్రవారం) సాయంత్రం 6గంటలకు హసన్‌పర్తి – భీమారం గ్రామాలకు స్వామివారి తిరుగు పయణం

భారీ బందోబస్తు

ఉత్సవాలను పురస్కరించుకుని జాతరకు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ తెలిపారు. ఇద్దరు పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఏఎస్సైలు, 10మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధులు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.



వేంకటేశ్వర స్వామి మూలవిరాట్



దేవతామూర్తుల ప్రతిమలు



జాతర ప్రాంగణంలో వెలిసిన జాయింట్ వీల్

రాజరాజేశ్వరి అమ్మవారికి కనకాంబరాలతో పుష్పార్చన



హన్మకొండ కల్చరల్: ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయంలో అమ్మవారికి ఆదివారం కనకాంబర పూలతో పుష్పార్చన చేశారు. ఆలయ అర్చకుడు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి సౌందర్య లహరి పారాయణంతో కనకాంబరాలతో కౌముదిపూజ నిర్వహించారు. అధికసంఖ్యలో మహిళలు పూజలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన అరూరి రమేష్



హన్మకొండ: కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ కలిశారు. హైదరాబాద్‌లోని స్వగృహంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. పార్టీలో చేరిన తర్వాత మొదటిసారి కలిసిన రమేష్‌కు మంత్రి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

క్లుప్తంగా

సమాజ హితానికి కవిత్వం దోహదం



ప్రశంసపత్రాలు అందుకున్న పద్య కవులు

హన్మకొండ అర్బన్: సమాజంలో మంచిని పెంచడానికి కవిత్వం ఎంతగానో ఉపయోగపడుతుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ అన్నారు. వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎల్లలు లేని కవిత్వం మానవళికి మార్గదర్శనం అనే అంశంపై హనుమకొండ సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ భవనంలో సర్వభాషా కవి సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పద్య కవులను సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు. చైతన్య విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య గుర్రపు దామోదర్, ఎండి.సి రాజుద్దీన్, ఆచార్య బానోతు సురేష్‌లాల్, శ్రీపాద సుధాకర్ రావు పాల్గొన్నారు.


చిరుధాన్యాలు ఆరోగ్యకరం



చిరుధాన్యాలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

హసన్‌పర్తి: చిరు ధాన్యాలు ఆరోగ్యకరమని మహర్షి గోశాల చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రమేష్ అన్నారు. చింతగట్టులోని మహర్షి గోశాలలో రికార్డ్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మిల్లెట్స్ ఉత్పత్తుల ప్రదర్శనను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల శారీరక రుగ్మతలు అదుపులో ఉంటాయన్నారు. జంక్ ఫుడ్ బారిన పడకుండా చిరుధాన్యాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రికార్డ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్, మిల్లెట్స్ కుకింగ్ నిపుణురాలు కవిత, మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్‌తో పాటు గోశాల కార్యదర్శి కిషన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ హఠాన్మరణం



శ్రీనివాస్ (ఫైల్)

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండలోని శ్రీభాలక్ష్మి ఆటో యూనియన్ ఆటో డ్రైవర్ సాదినేని శ్రీనివాస్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుడు శ్రీనివాస్‌కు ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. ఆర్థికంగా వెనుకబడిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన సిర్ర రమేష్ (55) శనివారం మధ్యాహ్నం ఇంటిపై నుంచి కింద పడడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. ఈక్రమంలో ఆదివారం పిట్స్ రావడంతో మళ్లీ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ రమేష్ మృతి చెందాడు. మృతుడి కుమారుడు శశికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతకు అభినందన



అశోక్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ: ఇండియా ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత పరికిపండ్ల అశోక్‌ను పద్మ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కరోనా సమయంలో ప్రముఖ హోమియోపతి వైద్యుడు డాక్టర్ అశోక్ పరికిపండ్ల అనేక ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధి నివారణ మందును ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన కర్ణాటకకు చెందిన బ్లైండ్ విన్ సంస్థ.. ఇండియన్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసి ఈనెల 17న అవార్డు అందించి సన్మానించింది. హనుమకొండలోని పద్మశాలి భవనంలో అవార్డు గ్రహీతను పద్మ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అభినందించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుకమారి వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఎంపీడీఓ గుల్లెపల్లి విద్యాసాగర్, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ గవర్నర్ మంత్రి లింగమూర్తి, మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీనారాయణ, పద్మశాలి పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి గజ్జల అమరేందర్, బ్రహ్మకుమారి వేల్పుల నరేష్, సంగిశెట్టి సందీప్, సూర్యనారాయణ, దివ్యశ్రీ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాముడి దహన వేడుకలు



పెరకవాడ అండర్ బ్రిడ్జి వద్ద కాముడి దహనం



కార్యక్రమంలో కార్పొరేటర్ కల్పన, తదితరులు

ఖిలా వరంగల్: వరంగల్ త్రికోటలో ఆదివారం రాత్రి కాముడి దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తూర్పుకోట పోచమ్మ దేవాలయ కమిటీ బాధ్యులు ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ హాజరై కాముడి దహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వరంగల్ మధ్యకోటలో బైరబోయిన ఉమ, మాజీ కార్పొరేటర్ దామోదర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. అలాగే, 33వ డివిజన్ కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ, సుధాకర్ ఆధ్వర్యంలో, పెరకవాడలో మాజీ కార్పొరేటర్ దిడ్డి నాగరాజు ఆధ్వర్యంలో కాముడి దహన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆయా కార్యక్రమాల్లో కరాటే ప్రభాకర్, శామంతుల శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

పిన్నవారి వీధిలో..

వరంగల్ అర్బన్: వరంగల్‌లోని పిన్నవారి స్ట్రీట్‌లో కార్పొరేటర్ గందె కల్పన ఆధ్వర్యంలో కాముడి దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఫలని సేవాదళ్ అధ్యక్షుడు బొడ్ల రవీంద్రనాథ్, శ్రీనాథ్, రాధేశ్యామ్, నవీన్ పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: హస్‌పర్తి మండలంలోని పలు గ్రామాల్లో కాముడి దహన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. హోలీ కార్యక్రమాల్లో యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

దయానంద కాలనీలో..

కాశిబుగ్గ: కాముడి దహన వేడుకలను దయానంద కాలనీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ పాల్గొని వేడులను ప్రారంభించారు.



హసన్‌పర్తిలో..



కాశిబుగ్గ: దయానంద కాలనీ జంక్షన్‌లో..

శ్వేతార్కలో పంచాంగం ఆవిష్కరణ



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఆదివారం రాత్రి శ్రీక్రోధి నామ సంవత్సర సూర్య సిద్ధాంత పంచాంగాన్ని శ్రీక్షేత్ర పీఠాధిపతి గురు మధుసూదనానంద సరస్వతి ఆవిష్కరించారు. శివక్యం పొందడానికి ముందు అయినవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి రూపొందించిన పంచాంగాన్ని విధ్వత్ సభ పండితులతో కలిసి పంపిణీ చేశారు. శ్రీగురు మదనానంద పీఠానికి సిద్ధాంతి కుమారులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మను సిద్ధాంతులుగా ప్రకటించారు. అనంతరం అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి స్మృత్యంజలి సభను మరుమాముల వెంకటరమణ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో భద్రకాళి శేషు, గంగు ఉపేంద్రశర్మ, శంకరశర్మ, గంగు సచ్చిదానంద మూర్తి, మాడ ప్రభాకర శర్మ, అన్నవజ్జుల సోమశేఖర శర్మ, త్రిపురారి సూర్యప్రసాద శర్మ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే, ముస్లింలు

కాజీపేట రూరల్: మత సామరస్యానికి రంజాన్ ప్రతీక అని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట డీజిల్‌కాలనీలోని విజేత స్కూల్‌లో ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఎండి.సాజీద్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తన సతీమణి నీలిమతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పవిత్రమాసంలో ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. మతాలకు అతీతంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్, మాజీ కార్పొరేటర్లు అబుబక్కర్, రావుల సదానందం, సుంచు అశోక్, నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, ఎండి.అంకూస్, ఉపేందర్, సిరిల్‌లారెన్స్, ఎస్‌కె.అజ్గర్, రాంబాబు, సిలువేరు విజయ భాస్కర్‌రెడ్డి, ఇప్ప శ్రీకాంత్, పోగుల శ్రీనివాస్, మాతంగి స్వామి, భద్రయ్య, భానుచందర్, కొమురెల్లి రమేష్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఖిలా వరంగల్: భర్త వదిలేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకపోవడంతో కుటుంబ పోషణ భారమై మనస్తాపంతో ఓ మహిళా క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం రంగశాయిపేట ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన భార్య, ఇద్దరు పిల్లలను వదిలేసి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కాపురానికి దూరంగా ఉండంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈక్రమంలో ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి లోనై సదరు మహిళ ఆదివారం రాత్రి లైజోల్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించారు.

నగరంలో ఘనంగా 'మట్టల ఆదివారం'



కడిపికొండ రాజీవ్ గృహకల్ప సముదాయంలో..



న్యూశాయంపేటలో ర్యాలీ తీస్తున్న చిన్నారులు



బాపూజీనగర్ గెత్సేమనే చర్చి వద్ద సభ్యులు



దర్గా చర్చిలో మట్టల ఆదివారం



హసన్‌పర్తి: ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వాసకులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలోని కల్వరి ప్రేమ మందిరం ఆధ్వర్యంలో మట్టల ఆదివారపు ఆరాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కొబ్బరి, ఈత మట్టలను పాస్టర్ బొందుగుల కరుణాకర్, మందిర విశ్వాసులు చేతపట్టుకుని ప్రత్యేక ర్యాలీ తీస్తూ దేవుడి గీతాలాపనతో ప్రార్థనలు నిర్వహించారు.

న్యూశాయంపేటలో..

31వ డివిజన్‌లోని హోర్మోన్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో పాస్టర్ రెవరెండ్ రాము మట్టల ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండువేల ఏళ్ల క్రితం ఏసుక్రీస్తును సిలువ వేసిన ఆదివారం రోజును మట్టల ఆదివారంగా నిర్వహించి ఏసుక్రీస్తును ప్రత్యేకంగా ప్రార్థిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రార్థన మందిర విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట బాపూజీనగర్‌లో..

కాజీపేట రూరల్: కాజీపేట బాపూజీనగర్ మెయిన్ రోడ్డులోని గెత్సేమనే ప్రార్థన మందిరంలో ఆదివారం మట్టల ఆదివారం పండుగను నిర్వహించారు. పూలతో అలంకరించిన మట్టలను పిల్లలు, సంఘం పెద్దలు చేతపట్టుకుని చర్చి నుంచి డీజిల్ కాలనీ వరకు ర్యాలీ తీస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా జయహో హోసన్న అంటూ నినాదాలు చేశారు. అనంతరం జెరుసలెంకు ఏసుక్రీస్తు ప్రవేశించిన తీరుపై చర్చి పాస్టర్ ఆర్.రవిపాల్ సందేశం చేశారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

దర్గా చర్చిలో..

కాజీపేట దర్గాలో శూలమితి పెంతెకోస్తు సంఘంలో ఆదివారం మట్టల పండుగ జరిగింది. పాస్టర్ రెవరెండ్ దామెర ప్రసాద్, సుష్మ.. ఏసుక్రీస్తు సందేశం చేసి మట్టల ఆదివారం ప్రాముఖ్యతను వివరించారు. చర్చి పిల్లలు, పెద్దలు మట్టలతో దర్గా వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘపెద్దలు సారయ్య, సందీప్, రాజు, బాబు, విజయ్, సభ్యులు పాల్గొన్నారు.

భీమారంలో..

హసన్‌పర్తి: మట్టల ఆదివారం వేడుకలు భీమారంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లివింగ్ ఏజీ చర్చి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఏసును స్మరిస్తూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో పాస్టర్ ప్రవీణ్, స్థానికులు సంగాల విక్టర్ బాబు, డేవిడ్, పరమేష్, జన్ను సొమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి నాగవెల్లి



నాగవెల్లి నిర్వహిస్తున్న అర్చకులు

మడికొండ: మడికొండలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామివారి నాగవెల్లి ఆదివారం మహావైభవంగా జరిగింది. సాయంత్రం గ్రామ శివారులోని తోట దగ్గర నుంచి అశ్వవాహనంపై డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా స్వామివారిని తోలుకుని వచ్చారు. అనంతరం ఎదుర్కోళ్లు నిర్వహించి రాత్రి 8గంటలకు అర్చకులు ప్రతాప రాజేష్‌శర్మ, ముస్కె శ్రీకాంత్, అనుముల నవీన్ మంత్రోచ్ఛరణల మధ్య నాగవెల్లి జరిపించారు. అనంతరం బండ్ల తీర్థం, స్వామివారి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నిగ్గుల సతీష్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ యాదగిరి, దువ్వ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు కడార్ల నరేందర్, కార్యదర్శి కల్లెపు నరేష్, కోశాధికారి పత్తిపాక ఉపేంద్రచారి, సహాయ కోశాధికారి బల్సుకూరి రవిందర్, బోగి దయాకర్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ టి.యాదగిరి, కుందూరు రాజేష్‌రెడ్డి, అల్లం శ్రీనివాస్, దువ్వ శ్రీకాంత్, కంచెనపల్లి వెంకటయ్య పాల్గొన్నారు.

'రంగుల' సందడి



ఫోర్ట్‌రోడ్డులో రంగులు కొనుగోలు చేస్తున్న పిల్లలు



హసన్‌పర్తి: హోలీ వేడుకల్లో విద్యార్థులు

ఖిలా వరంగల్: హోలీ వేడుకలను పురస్కరించుకుని వరంగల్ నగరంలో రంగులతోపాటు పిచికారీ వస్తువల విక్రయాలు జోరందుకున్నాయి. రంగుల షాపుల్లో పిల్లల సందడి ఎక్కువగా ఉంది. ఆదివారం రాత్రి నగర వీధులతోపాటు గ్రామ ముఖ్య కూడళ్లలో ప్రజలు కామదహనం చేశారు. సోమవారం హోలీ వేడుకలు జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డుపై రంగుల ప్యాకెట్లు, చిన్నారుల కోసం పిచికారీ వస్తువులు విక్రయిస్తున్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో పర్యావరణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం హోలీ వేడుకలను నిర్వహించారు. సహజంగా లభించే పసుపు, కుంకుమ, బుక్క గులాలు, పువ్వులతో తయారు చేసిన రంగులతో హోలీ జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట రాంబాబు, ఉప ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన రామకృష్ణ



హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీపీసీసీ ఎస్సీ సెల్ జిల్లా బాధ్యుడు, వరంగల్ లోక్‌సభ సీటు ఆశిస్తున్న డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేశారు. అధికారంలో ఉన్నా లేకపోయినా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను గుర్తించాలని కోరారు. వరంగల్ ఎంపీ టికెట్ తనకు కేటాయిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.